# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## ఏనాటిదో ఈ అనుబంధం
## - చక్రపాణి గురించి నాగిరెడ్డి

### (విజయచిత్ర – 1994, అక్టోబర్ సంచిక నుంచి )



జ్ఞాపకాలు

'ఏనాటిదో ఈ అనుబంధం...'

-బి. నాగిరెడ్డి

పి.పుల్లయ్య గారి దర్శకత్వంలో 'ధర్మపత్ని' చిత్రాన్ని నిర్మిస్తున్న రోజులవి. ఆ చిత్రానికి సంభాషణలు రాయడానికి ఒక రచయితను పిలిపించారు.

ఐతే, ఆ రచయిత రాసిన సంభాషణలు దర్శకుడికి అంత సంతృప్తికరంగా అనిపించక 'చందమామ' రామారావు గారు తెనాలి నుంచి చక్రపాణి గారిని రప్పించారు మళ్ళీ సంభాషణలు రాయించడానికి.

'ధర్మపత్ని' చిత్రానికి చక్రపాణి గారు రాసిన సంభాషణలు సంతృప్తికరంగా వుండడంతో వాహినీ వారి 'స్వర్గసీమ' చిత్రానికి కూడా ఆయన చేతనే సంభాషణలు రాయించడం జరిగింది. అప్పటి నుంచి అంటే 1943 నుంచీ మా సంస్థకీ చక్రపాణి గారికీ అలా అనుబంధం ఏర్పడింది.

చక్రపాణి గారి అసలు పేరు ఎ.వి.సుబ్బారావు. ఆయనకి తెలుగు, తమిళం, హిందీ, బెంగాలీ భాషలు క్షుణ్ణంగా తెలుసు.

అసలు ఆయన బెంగాలీ భాష నేర్చుకోవడమే చాలా చిత్రంగా జరిగింది. అదెలాగంటే, ఆయన టి.బి. చికిత్స నిమిత్తం మదనపల్లి లోని 'ఆరోగ్యవరం' హాస్పిటల్ లో చేరారు. అక్కడ ఆయన పక్క బెడ్ లోని పేషెంట్ ఒక బెంగాలీ వ్యక్తి. చికిత్స నిమిత్తం మూడు మాసాల పాటు ఆ ఆస్పత్రిలో వున్న చక్రపాణి గారు ఆ వ్యక్తితో పరిచయం పెంచుకుని. ఆయన వద్దే బెంగాలీ భాష మాట్లాడడం, రాయడం, చదవడం నేర్చుకున్నారు. ఆ తర్వాత సుప్రసిద్ధ బెంగాలీ రచయిత శరత్ చంద్ర చటర్జీ గారి నవలలను తెలుగు భాషలోకి అనువదించే స్థాయికి చేరుకున్నారు. ఏదైనా నేర్చుకోవాలనే తపన వుంటే చాలు.

ఎట్టి పరిస్థితుల్లోనైనా ఎలాంటి వారైనా నేర్చుకోగలరు అనడానికి చక్రపాణి గారు ఒక నిదర్శనం. ఆయనలో గల ఈ సామర్థ్యమే ఆయనపై నాకు అపరిమితమైన అభిమానం కలగడానికి దోహదం చేసింది.

ఒక సారి ఆయన తాను అనువదించిన నవలల మొదటి సంపుటి పూర్తయిన సందర్భంగా, రెండవ సంపుటిని విడుదల చేసే ఉద్దేశ్యంతో నా వద్దకు వచ్చారు. బి.ఎన్.కె. ప్రెస్ ఆరంభించిన కొత్తలో 'యువ పబ్లికేషన్స్' ద్వారా తన పుస్తకాలను విడుదల చేయమని ఆయన నన్ను కోరారు. ఆ సమయంలోనే మా స్నేహం మరింత బలపడింది.

ఇటు స్టూడియో అటు పబ్లికేషన్ కి సంబంధించిన పనులతో సతమతమవుతున్న చక్రపాణి గార్ని మద్రాసులోనే కాపురం పెట్టమని సలహా ఇచ్చాను. ఆయన, తల్లి లేని తన ఇద్దరు కొడుకులతోనూ మద్రాసుకు మకాం మార్చారు. పెద్ద కొడుకు తిరుపతి రావు(మేము ముద్దుగా అతడ్ని 'తిరు' అని పిలిచేవాళ్ళం). రెండవ కొడుకు సుధాకర్. (ప్రస్తుతం హైద్రాబాదులో వున్నాడు) వాళ్ళిద్దరినీ చదువు నిమిత్తం రాయపేటలోని 'చిల్డ్రన్ గార్డన్ స్కూలు'లో చేర్చాము. తమ స్కూల్లో పిల్లలకి సీటు ఇచ్చిన ఆ స్కూలు నిర్వాహకులు, శర్మగారు అక్కడ హాస్టల్ వసతి లేదన్నారు.

ఈ విషయాన్ని నా భార్యకి చెప్పి. 'తల్లిలేని ఈ ఇద్దరు పిల్లలకీ నువ్వే తల్లిగా ఉండాలి' అన్నాను.

అందుకు ఆమె మారు మాట చెప్పకుండా తన సమ్మతిని తెలియజేసింది. అప్పటి నుంచీ ఆ ఇద్దరు పిల్లలూ మాతో పాటే వుండేవారు. మా పిల్లల్తో పాటు వాళ్ళూ నా భార్యని 'అమ్మా' అని పిలిచేవారు.

వారికేదన్నా అవసరమొచ్చి చక్రపాణి గారిని అడిగితే, 'వెళ్ళి అమ్మనడగండి' అని పంపేసేవారు ఆయన.

ఆయనకు నా చిన్న కొడుకు బాబ్జీ (నిర్మాత బి.వెంకట్రామరెడ్డి), నా కుమార్తె శారద అంటే చాలా అభిమానం. పిల్లల మధ్య ఆయనా ఒక చిన్నపిల్లవాడిలా ప్రవర్తించే వారు. అలా క్రమక్రమంగా ఆయన మా కుటుంబ సభ్యులలో ఒకరయ్యారు.

ఆయన మా ఇంటి మేడ మీద ఓ గదిలో వుండేవారు. నాగిరెడ్డి – చక్రపాణి అంటే ఇద్దరూ అన్నదమ్ములేమోనని అందరూ అనుకునే స్థాయికి మా ఇద్దరి మధ్య స్నేహం వర్ధిల్లింది. ఆయన పిల్లలూ, మా పిల్లలూ ఒకే చోట పడుకోవడం వల్ల ఇంట్లో స్థలం చాలక నేను వరండాలో పడుక్కోవలసి వచ్చేది.

పనిమీద బయటికెళ్ళి – రాత్రి ఎనిమిది గంటల లోపు నేను ఇంటికి తిరిగి రాకపోయే సరికి చక్రపాణి గారు విలవిల లాడిపోయేవారు. వచ్చిన తర్వాత వెంటనే ఆలస్యానికి తగిన కారణం ఆయనకి చెప్పి తీరాల్సిందే. లేకపోతే వూరుకునే వారు కాదు. అలా నన్ను కంటికి రెప్పలా కాపాడేవారు. నా గురించి ఎవరైనా (అది మా పిల్లలే అయినా సరే !) పొరబాటుగా మాట్లాడితే సహించేవారు కాదు ఐతే, తను మాత్రం నన్ను అప్పుడప్పుడు మందలించేవారు. ఆ మందలింపు కూడా ఒక గురువు తన ప్రియ శిష్యుడ్ని మందలించే తీరులో వుండేది.

ఈ స్నేహమే దినాదినాభివృద్ధి చెంది కాలక్రమేణా భాగస్వామ్యానికి పునాది వేసింది. నేను స్టూడియో ప్రారంభిద్దామని 'ప్లాన్' చేసినప్పుడు అందులో తనూ ఒక భాగం పంచుకున్నాడు. ఆ విధంగా 'విజయా ప్రొడక్షన్స్' ను స్థాపించి, సంస్థ తొలిచిత్రంగా 'షావుకారు' ని నిర్మించాం. ఆ చిత్రానికి కథ రాసింది చక్రపాణి గారే! ఆ చిత్రం టైటిల్స్ లో మొదటి సారిగా 'నాగిరెడ్డి – చక్రపాణి' అని చూపించాం. అప్పుడు ప్రారంభమైన ఆ జంట పేర్లు ఆయన బ్రతికి వున్నంత కాలమూ మా చిత్రాలన్నింటిలోనూ 'టైటిల్స్' లో కనిపించింది.

కథ.. సంభాషణలు.. దర్శకత్వం.. ఇలా మా చిత్రాల నిర్మాణ బాధ్యతంతా ఆయనే వహించేవారు.

చిత్రం పంపిణీ బాధ్యత మాత్రం నేను నిర్వహించేవాడిని. అతని పనిలో నేను గాని, నా పనిలో అతను గాని ఎన్నడూ జోక్యం కలిగించుకునే వారం కాదు.

పని విషయంలో మాత్రం ఆయన చాలా కఠినంగా వ్యవహరించేవారు.

ఉదాహరణకి, 'మిస్సమ్మ' చిత్రం తొలి షెడ్యూలులో భానుమతి నటించారు. రెండవ షెడ్యూలు చిత్రీకరణ ప్రారంభానికి ముందు, కథ ప్రకారం భానుమతి క్రైస్తవ కుటుంబానికి చెందిన అమ్మాయి. ఎన్.టి.రామారావు హిందువు. ఉద్యోగం కోసం ఇద్దరూ భార్యా భర్తలుగా నాటకం ఆడే దృశ్యాలు చిత్రీకరించాల్సిన సమయంలో – భానుమతికీ, చక్రపాణి గారికీ ఏదో విషయంలో అభిప్రాయ భేదాలు వచ్చాయి.

వెంటనే చక్రపాణి గారు భానుమతిని పిల్చి, అంతవరకూ 'షూట్' చేసిన 'నెగెటివ్' ని ఆమె కళ్ళ ముందే కాల్చేసి ఆమెకు ఇవ్వాల్సిన పారితోషికం అణాపైసల్తో సహా లెక్కగట్టి ఇచ్చి పంపేశారు.

ఆ తర్వాత, అంతవరకూ చిన్న చిన్న పాత్రలు పోషిస్తున్న సావిత్రిని కథానాయికగా ఎన్నుకుని 'మిస్సమ్మ' చిత్రాన్ని పూర్తి చేశారు. అలాంటి గుండె ధైర్యం వున్న వ్యక్తి ఆయన.

అలాగే, 'రామ్ ఔర్ శ్యామ్' (తెలుగులో రాముడు – భీముడు) హిందీ చిత్రంలో కథానాయిక పాత్రకి అప్పట్లో 'నెంబర్ వన్' స్థానంలో వున్న 'హీరోయిన్' ని ఎన్నుకున్నారు. ఐతే, చిత్రీకరణ సమయంలో ఆమెతో మా యూనిట్ కి విభేదాలు వచ్చి అప్పట్లో అది తీవ్రమైన సంచలనాన్ని సృష్టించింది. ఫలితంగా ఆ చిత్రంలో వహీదా రెహమాన్ కథానాయికగా నటించాల్సి వచ్చింది. ఆనాడు ఎదురైన సమస్యను నేను ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించడానికి అనంత నారాయణన్, అడ్వొకేట్ ఎన్.సి.రాఘవాచారి, ఎ.ఎల్.శ్రీనివాసన్ మొదలైన వారు ఎంతో సహకరించారు. ఐతే, అన్నింటినీ మించి నాకు అండదండగా నిల్చి ధైర్యాన్ని నూరి పోసింది చక్రపాణి గారే! ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సంఘటనలున్నాయ్!.

ఈనాడు పన్నెండు భాషల్లో ప్రచురించబడుతున్న 'చందమామ' పేరు ప్రఖ్యాతులు అందరికీ తెలిసినవే! ఆరేళ్ళ పిల్లల దగ్గర్నుండీ ఎనభైయ్యేళ్ళ వృద్ధుల వరకూ 'పెద్దలు చదివే పిల్లల పత్రిక' గా కొనియాడబడుతూన్న ఆ పత్రిక పేరు ప్రఖ్యాతులకు మూలపురుషుడు చక్రపాణి గారే!

ప్రతి కథకీ ఒక ప్రయోజనం వుండాలి. పఠితలు తమతమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడానికి దోహదం చేసేలా వుండాలి. మనో వికాసంతో పాటూ విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా వుండాలి అనేవారు. ఆ సిద్ధాంతంతోనే నేటి యువతరానికి మన సంప్రదాయాల్ని, పురాణేతి హాసాల్ని తెలియజెప్పాలనే ఉద్దేశంతో రామాయణం, భారతం, భాగవత కథల్ని పాత్రల్ని అందమైన బొమ్మలతో ప్రచురించేవారు. నూట నాలుగు డిగ్రీల జ్వరంతో బాధపడుతూన్నా సరే, చక్రపాణి గారి ఆమోదం లేనిదే 'చందమామ' లో ఒక్క వాక్యం కూడా ప్రచురించబడేది కాదు. ఆ పత్రికతో ఆయనకున్న అనుబంధం అలాంటిది.

పేరుకు పిల్లల పత్రికే అయినా. అందులో పెద్దవాళ్ళకి కూడా ఉపదేశాలు వుండాలి. అయితే, ఆ ఉపదేశాలు ఏ 'ఇజా'నికీ లోబడి వుండకూడదు అనేది ఆయన సిద్ధంతం. ఇతరులు రాసి పంపిన కథల్ని కూడా దిద్ది తిరగరాయమనే వారు ఆయన. ఒక్కోసారి ఆయనే రాసేవారు కూడా!

చిత్ర నిర్మాణంలోనూ, పత్రికా నిర్వహణలోనూ ఆయన చేసిన సేవలు అమూల్యం.

ఉదయం పూట స్టూడియో వ్యవహారాలు, మధ్యాహ్నం రెండు గంటలసేపు పత్రికా నిర్వహణ కార్యక్రమాలు, ఆ తర్వాత రాత్రి ఏడుగంటల వరకూ స్టూడియో... ఆ పైన మళ్ళీ పత్రికాఫీసులో పని.. ఇది చక్రపాణి గారి తీరికలేని దినచర్య.

ఆయన విజయాలకి ముఖ్యకారణం – ఆయనకున్న లౌకిక జ్ఞానం. చిత్ర నిర్మాణంలో ఆయనొక ప్రేక్షకుడు. 'చందమామ' ప్రచురణలో ఆయన ఒక పాఠకుడు.

చిన్నపిల్లలకు ఏవి నచ్చుతాయి? ఏవి నచ్చవు? – అనేవి చక్కగా విశ్లేషించగలడాయన. అలాగే చిత్రాల విషయంలో కూడా ప్రేక్షకులకు ఏది నచ్చుతుంది? ఏది నచ్చదు? – అనేది చక్కగా పరిశీలించి చెప్పగలగడం ఆయన ప్రత్యేకత.

ఇంతటి వివేచనా శక్తి, దూరదృష్టిగల మేము నిర్మించిన చితాల్లో ఘోర పరాజయం పొందిన చిత్రం 'చంద్రహారం'.

'పాతాళ భైరవి' అఖండ విజయం సాధించిన తర్వాత ఆ ఉత్సాహంతో దాన్ని మించిన మరో అద్భుతమైన చిత్రాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో నిర్మించిన చిత్రం 'చంద్రహారం.' ఎన్.టి.రామారావు, ఎస్.వి.రంగారావు, శ్రీరంజని, సావిత్రి వంటి భారీ తారాగణంతో నిర్మించిన ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని అనుకున్నాము. దానికి తగ్గట్టే భారీ ఎత్తున 'పబ్లిసిటీ' చేశాం. ఆంధ్రదేశమంతటా చిత్రం విడుదలైంది.

నెల్లూరులో మా మావగారి థియేటర్ 'శేష్ మహల్' లో విడుదలైంది. 'చంద్రహారం' చిత్రానికి భారీ ఎత్తున ఆదరణ లభిస్తుందనే ఆశతో నేను, చక్రపాణీ సాయంత్రం ఆటకి థియేటర్ కి వెళ్ళాం. చిత్రం ప్రారంభమైంది. విరామ సమయంలో మమ్మల్ని చిత్ర నిర్మాతలుగా గుర్తుపట్టిన కొందరు విద్యార్థులు 'విరామం తర్వాతైనా చిత్రంలో కథ వుంటుందా ! హీరో ఇకనైనా నిద్రలేస్తాడా?' అని అడిగారు. దాంతో, అంతవరకూ ఆ చిత్రం పట్ల మాకున్న నమ్మకం కాస్తా గాల్లో కలిసిపోయింది.

మా మావగారింటికి కూడా వెళ్ళకుండా థియేటర్ నుండీ నేరుగా కారులో మద్రాసుకి బయల్దేరాం. నెల్లూరు నుంచి మద్రాసులో టి.నగర్ లోని మా ఇంటికొచ్చే వరకూ మేమిద్దరం ఒక్క మాట మాట్లాడితే ఒట్టు.

ఇల్లు చేరాక, కారు దిగుతూ 'గంట ఎంతైంది?' అని అడిగాను చక్రపాణి గారిని.

'రెండున్నర' అన్నారు ఆయన.

అలాగే వెళ్ళి పడుకొని మర్నాడు ఉదయం లేచి ఆ చిత్రం గురించి తీవ్రంగా ఆలోచించడం మొదలుపెట్టాం.

'చంద్రహారం' సినిమా పూర్తయిన తర్వాత మద్రాసులో 'ప్రొజెక్షన్' వేస్తే, చూసిన వాళ్లంతా 'చిత్రం సూపర్ హిట్' అన్నారే! మరి ఎందుకింత ఘోరంగా పరాజయం పొందింది? – అని విశ్లేషించుకున్నాం. చిత్రం గురించి. అందులోని లోటుపాట్లు గురించి ప్రేక్షకుల దృష్టితో ఆలోచించాం, ఒక నిర్ణాయినికి వచ్చాం. ఆ నిర్ణయాన్ని, మా తదుపరి చిత్రాల నిర్మాణంలో అమలు జరిపాము. ఫలితంగా ఎన్నో విజయాలు చవిచూశాం.

చక్రపాణి గారు ఒక కథని, చిత్ర కథగా తయారు చేసి, దాన్ని మా పిల్లలకి చదవడానికి ఇచ్చేవారు. పిల్లల అభిప్రాయాల్ని ఆయన తప్పని సరిగా వినేవారు. వాటిలో ఆచరణ యోగ్యమని అనిపించిన వాటిని చిత్రంలో ఉపయోగించేవారు. వయోభేదం పాటించకుండా అందరి అభిప్రాయాలనూ ఆయన గౌరవించేవారు. చిత్రంలో సంభాషణలు పాత్ర పరంగా నిర్దుష్టంగా, టూకీగా వుండాలనే వారాయన. ఇలా ప్రతి విషయాన్నీ నిశితంగా పరిశీలించేవారు.

ఆంధ్ర దేశంలో ప్రభలమైన కులాలు రెండు – ఒకటి రెడ్డి, రెండు కమ్మ మాలాగే (నేను రెడ్డి కుటుంబానికి చెందిన వాడ్ని, చక్రపాణి కమ్మ కుటుంబానికి చెందిన వారు) ఈ రెండు కులాల మధ్య సఖ్యత ఏర్పడాలన్న సదుద్దేశంతో చక్రపాణి గారు ఎన్.టి.రామారావు, అక్కినేని నాగేశ్వరరావులను రెడ్డి–కమ్మ కులాలకు ప్రతినిధులుగా రెండు పాత్రలు సృష్టించి, వారితో 'కాలం మారింది – మనుషులే మారాలి' అనే చిత్ర నిర్మాణానికి సన్నాహాలు చేశారు. ఐతే, ఆ చిత్ర నిర్మాణం ప్రారంభం కాకముందే చక్రపాణి గారు అకాల మృత్యువు వాతబడ్డారు. ఆయన లేకుండా చిత్రాన్ని నిర్మించే ధైర్యం నా మనసుకి రాలేదు.

మా స్నేహాన్ని విడదీయగల శక్తి ఆ మృత్యువుకి మాత్రమే వుంది. ఆయన భౌతికంగా నానుంచి వేరైనది మా 'విజయా హాస్పిటల్' లోనే! చక్రపాణి గారి కుటుంబ సభ్యులు (కీ.శే.తిరుపతి రావు కుటుంబం) మా కుటుంబంతో కలసిమెలసి వుండడం. ఆయన నాతో సన్నిహితంగా మెలిగినంత సంతృప్తిని కలుగజేస్తోంది.

ఈనాడు నా గురించి ప్రజలకు ఈ మాత్రమైనా తెలిసి వుండడానికి కారణం చక్రపాణి గారే! నాకు మంచి మిత్రుడుగా, సోదరుడుగా, మార్గదర్శిగా, గురువుగా వుండి చిరస్మరణీయుడయ్యారు చక్రపాణి గారు.

★★★

COMMENTS